క్లుప్తంగా

గ్రామ సచివాలయం తనిఖీ


గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ నందకిశోర్

బ్రహ్మసముద్రం: మండలంలోని భైరసముద్రం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ నందకిశోర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గారమ సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

గోళ్లలో మైక్రో వాటర్‌షెడ్ పనుల పరిశీలన


గోళ్లలో వాటర్‌షెడ్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గోళ్ల గ్రామంలో వాటర్‌షెడ్ పనులను ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖకుమార్, డ్వామా ఏపీడీ సుధాకర్‌రెడ్డి శుక్రవారం పరిశీలిచారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతులకు అవసరమైన పనులపై చర్చించారు. ఎన్‌ఆర్‌ఎం పనుల మెషిన్ ఫారంపాండ్లు, చెక్‌డ్యాం, అమృత్ సరోవర్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ కృష్ణ చైతన్య, పీఓ శ్రీవిద్య, జేఈ శ్రీరాములు, టీఏ శేషు, కమిటీ చైర్మన్ బోజన్న, రైతులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు


చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేంద్ర

విడపనకల్లు: మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో డాక్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో చిన్నారులకు ఆరోగ్య స్క్రీనింగ్ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. చిన్నారుల పుట్టుకతో పాటు వచ్చే లోపాలను కూడా గుర్తించి చికిత్సలు అందించారు. అనారోగ్యంతో ఉన్న చిన్నారులను గుర్తించి మెరుగైన చికిత్స కోసం సీహెచ్, ఏహెచ్, డీఈఐసీలకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రమీల, సూపర్ వైజర్ మునెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు నూర్,ఆశా వర్కర్లు,అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు వృథా


జల్లిపల్లి సమీపంలో ఎయిర్‌వాల్వ్ వద్ద లీకవుతున్న తాగునీరు

కూడేరు: మండలంలోని జల్లిపల్లి వద్ద అనంతపురం – బళ్లారి ప్రధాన రహదారి పక్కన అనంత తాగునీటి పైపులైన్ ఎయిర్ వాల్వ్ వద్ద లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోతోంది. మండలంలోని పీఏబీఆర్ డ్యాం నుంచి పైపులైన్ ద్వారా అనంతపురానికి తాగునీరు సరఫరా చేస్తున్నారు. జల్లిపల్లివాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు స్పందించి ఎయిర్ వాల్వ్ వద్ద ఏర్పడిన లీకేజీకి మరమ్మతు చేపట్టి తాగునీటి వృథా కాకుండా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉర్దూ హైస్కూల్ భవనాల ప్రారంభం


ఉర్దూ హైస్కూల్ భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు: కణేకల్లులో ఉర్దూ హైస్కూల్ నూతన భవనాలను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. డీఈఓ ప్రసాద్‌బాబుతో కలిసి ఎమ్మెల్యే భవనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉర్దూ హైస్కూల్‌లో పూర్తి స్థాయి వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్ఏ డీఈఈ శ్రీరాములు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ–1 లక్ష్మన్న, ఎంఈఓ–2 భవానీశంకర్, హెచ్‌ఎం రహంతుల్లా, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్, మాజీ ఉప సర్పంచు ఆనంద్, మాజీ ఎంపీపీ ఎ.మాబుసాబ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గంలో తీరని దాహం

- మంచినీటి సరఫరా నిర్వహణ అస్తవ్యస్తం
- సమృద్ధిగా నీరు ఉన్నా తప్పని కష్టాలు
- ఐదురోజులకోసారి సరఫరాతో జనం బేజారు

రాయదుర్గంటౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తాగునీటి సరఫరా నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో 'దుర్గం'లో తాగునీటి దాహం తీరలేదం లేదు. 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' చందంగా తాగునీరు సమృద్ధిగా ఉన్నా ప్రభుత్వ పనితీరు, అధికారుల అలసత్వంతో రెండురోజులకోసారి నీరు విడుదల చేస్తున్నారు. తరుచూ పైప్‌లైన్లు, మోటార్లు, పంపుసెట్ల మరమ్మతులు పేరిట తాగునీరు ఎప్పుడు సరఫరా అవుతుందో తెలియక ప్రజలు అయోమయ పరిస్థితిలో ఉన్నారు.

పట్టణంలో 32 వార్డులకుగాను 70 వేలకుపైగా జనాభా ఉండగా 2050 నాటికి పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని రోజూ నీరు సరఫరా చేసేలా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ చలువతో రూ.52 కోట్లతో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. తద్వారా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ఎస్ఎస్ ట్యాంకు పూర్తి స్థాయి నీటి మట్టం 3052 మిలియన్ లీటర్లు కాగా, రెండు రోజులకోసారి 9.5 ఎంఎల్‌డీ ప్రకారం పట్టణానికి నీటిని పంపిణీ చేస్తున్నారు. రెండురోజులకోసారి కాకుండా రోజు విడిచి రోజు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నీటితో కళకళలాడుతున్న ఎస్ఎస్ ట్యాంకు..

డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ తాగునీటి పథకం కింద కణేకల్లు వద్దనున్న ఎస్ఎస్ ట్యాంకులో 9 నెలలకుపైగా సరిపడా నీరు పుష్కలంగా ఉంది. ప్రస్తుతం ఎస్ఎస్ ట్యాంకు పూర్తి స్థాయి నీటిమట్టంతో కళకళలాడుతోంది. ఇంకా ఎస్ఎస్ ట్యాంకులోకి హెచ్చెల్సీ కాలువ ద్వారా నీటి పంపింగ్ కొనసాగుతోంది. ఈ లెక్కన ప్రతిరోజూ కాకపోయినా రోజు విడిచి రోజు నీటిని విడుదల చేసినా ఎలాంటి నష్టం ఉండదు. హెచ్చెల్సీ కాలవకు తుంగభద్రజలాల సరఫరా నిలిచిపోయినా బ్యాక్ వాటర్ ఉన్నంత వరకు ట్యాంకులోకి నీటిని పంపింగ్ చేయొచ్చు. కానీ ప్రస్తుతం పట్టణంలో రెండు, మూడు రోజులకోసారి నీటి సరఫరా అస్తవ్యస్తంగా చేస్తున్నారు. మరోవైపు తరుచూ ఏవో టెక్నికల్ సమస్య, మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల కారణాలతో ఏకంగా నాలుగు లేదా ఐదు రోజులకోసారి కూడా నీటిని సరఫరా చేస్తున్న పరిస్థితి ఉంది.

క్షేత్రస్థాయిలో సమస్య గుర్తించాలి..

క్షేత్ర స్థాయిలో మున్సిపల్ అధికారులు ప్రజల సమస్యను గుర్తించి, నీరు సరఫరా చేయాల్సి ఉంది. కానీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రోజు విడిచి రోజు నీరు సరఫరా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలోని వాల్మీకి నగర్, పైతోట, బీటీపీ శివారు కాలనీల్లో నేటి వరకు హెచ్చెల్సీ పైప్‌లైన్ వసతి లేదు. దీంతో అక్కడి ప్రజలకు ఇప్పటికీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకుని పట్టణవాసులకు నీటి సరఫరాలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఐదు రోజులుగా నీటి సరఫరా బంద్

తాజాగా పట్టణంలోని బళ్లారి రోడ్డులో నాలుగు చోట్ల పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా ఐదు రోజులుగా నీటిసరఫరా జరగలేదు. ప్రజలకు ముందస్తుగా ఎలాంటి సమాచారం అందించకపోవడమే కాక ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయలేదు. దీంతో ప్రజలు తాగునీటి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ కేవలం రెండు ట్యాంకర్ల ద్వారానే అధికారులు నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో నీటి సరఫరాను మెరుగుపరిచి రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


నిండుకుండలా దర్శనమిస్తున్న కణేకల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు


రాయదుర్గం వాల్మీకినగర్‌లో మున్సిపల్ ట్యాంకర్ వద్ద నీటి కోసం మహిళల అవస్థలు


రాయదుర్గంలోని బళ్లారి రోడ్డులో పైప్‌లైన్‌ను మరమ్మతు చేస్తున్న నీటి సరఫరా విభాగం సిబ్బంది

తాగునీటి సరఫరాలో విఫలం



పట్టణంలో తాగునీటిని సక్రమంగా విడుదల చేయడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలయ్యారు. నిర్వహణ లోపాలు సరిదిద్దుకుని సక్రమంగా నీరు సరఫరా చేయలేదు. ఎస్ఎస్ ట్యాంకులో నీరు పుష్కలంగా ఉన్నా అన్ని వార్డుల్లో తాగునీటికి అవస్థలు తప్పలేదు. మోటార్ల మరమ్మతు, పైప్‌లైన్ మరమ్మతులు అంటూ రోజుల తరబడి నీటిని విడుదల చేయలేదు.

– మల్లికార్జున, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, రాయదుర్గం

తాగునీటి సమస్య పరిష్కరించాలి



పట్టణంలో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మూడు లేదా నాలుగు రోజులైనా సరఫరా చేయడం లేదు. ప్రస్తుతం ఐదు రోజుల నుంచి నీరు సరఫరా కాలేదు. నీరు సరఫరా కాని పరిస్థితుల్లో ట్యాంకర్లు కూడా రావు. నీటి అవసరాల కోసం కాలనీలో నీటి ట్యాంకు సౌకర్యం కూడా లేదు.

– రఫియాబీ, 17వ వార్డు, రాయదుర్గం

నీటి సమస్య లేకుండా చర్యలు



లీకేజీల మరమ్మతు కారణంగా నీటి సరఫరాలో జాప్యం జరిగింది. కొన్నిసార్లు మోటార్లు మరమ్మతు చేసే సమయంలో పంపింగ్ జరగడం లేదు. వీటిని క్షేత్రస్థాయిలో పరిష్కరించి, నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. టెక్నికల్ సమస్యలు పరిష్కరించిన వెంటనే రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– నరసింహులు, మున్సిపల్ ఏఈ, రాయదుర్గం

పాలకుల మాటలు కాగితాలకే పరిమితం

కళ్యాణదుర్గం రూరల్: పాలకుల మాటలు కాగితాలకే పరిమితమని కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీశైలం డ్యాం నుంచి జీడిపల్లి రిజర్వాయర్ వరకు కృష్ణా జలాలు తీసుకొచ్చి 12 ఏళ్లయ్యింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణంలోని బళ్లారి మిట్ట నుంచి ఆర్‌డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. టీసర్కిల్‌లో మాజీ మంత్రి డాక్టర్ రఘువీరారెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ నియోజవర్గంలోని 114 చెరువులకు సాగునీరు, ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయి ఏర్పాటు చేస్తామని చెప్పినా నేటికీ పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్రెడ్డి, దాదాగాంధీ, రాయదుర్గం, గుంతకల్లు నియోజవర్గం ఇన్‌చార్జ్‌లు వడ్డే చిన్నప్పయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వేతనాన్ని పెంచాలి

కూడేరు: పారిశుధ్య కార్మికుల వేతనాన్ని రూ.6 వేలు నుంచి రూ.12 వేలకు పెంచాలని సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున, పారిశుధ్య కార్మికులు మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. శుక్రవారం మండలంలోని ఎంఎంహళ్లిలో మంత్రిని కలిసి వినతి పత్రం అందించారు. తక్కువ వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు వాపోయారు. ఆత్మకూరు బైపాస్ రోడ్డు నుంచి కూడేరు మీదుగా గార్లదిన్నె హైవే వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని మల్లికార్జున మంత్రిని కోరారు.

రికార్డుల బీరువాలో పాము కలకలం

శెట్టూరు: మండల పరిషత్ కార్యాలయంలోని రికార్డులు భద్రపరిచిన బీరువాలో పాము కనిపించడంతో ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారు. కార్యాలయ ఆవరణలో పాములు దర్శనమిస్తుంటాయి. దీంతో అధికారులు భయం భయంగా విధులు నిర్వహిస్తుంటారు. శుక్రవారం కార్యాలయంలోని ఏఓ శేషారెడ్డికి చెందిన రికార్డుల బీరువాలో పాము కనిపించింది. రికార్డులు బయటకి తీస్తుండగా పాము బయటకు వచ్చింది. దీంతో ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారు.

పశువులకు నట్టల నివారణ మందులు


బాలవెంకటాపురంలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశు వైద్యులు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బాలవెంకటాపురం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ పరీక్షలు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ సుధాకర్ మాట్లాడారు. బాలవెంకటాపురం గ్రామంలో సుమారుగా 32 పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్ గుప్త, కేవీకే హరిణి, అనిల్, పశువైద్యులు మంజునాథ్, పాలవాయి, రైతులు పాల్గొన్నారు.

జూడో ఓవరాల్ చాంపియన్ ఉరవకొండ


విజేతలుగా నిలిచిన ఏవీఆర్ విద్యార్థులతో జూడో అసోసియేషన్ సభ్యులు

ఉరవకొండ: స్థానిక జ్యోతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఈనెల 26 నుంచి ప్రారంభమైన జిల్లా స్థాయి జూడో జోనల్ లెవెల్ చాంపియన్ షిప్ పోటీల్లో ఉరవకొండ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. శుక్రవారం విజేతలుగా నిలిచిన వారికి పతకాలు ప్రదానం చేశారు. జూడో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ విఠల్, ఏవీఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ విక్రమ్, ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి శేఖర్, సీనియర్ జూడో కోచ్ సాకే పురుషోత్తం చేతుల మీదుగా బహుమతులు అందించారు. కోచ్ పురుషోత్తం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 200 మంది పోటీపడిన ఈటోర్నీలో ఓవరాల్ ఛాంపియన్ ఉరవకొండలోని ఏవీఆర్ స్కూల్ విద్యార్థులు నిలిచారన్నారు. 25, 45, 55, 100 కేజీల విభాగాల్లో 20 మంది విద్యార్థులు గోల్డ్, సిల్వర్ మోడల్స్, ట్రోఫీలు సొంతం చేసుకున్నారన్నారు. విజేతలుగా నిలిచిన వారు అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జరిగే సెంటర్ జోన్ జూడో పోటీల్లో పాల్గొంటారని జూడో అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి పెద్దపీట

- మంత్రి పయ్యావుల కేశవ్


కూడేరు: తారు రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

కూడేరు: కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మండలంలోని ఎంఎంహళ్లి గ్రామం నుంచి ఆత్మకూరు మండలం సిద్దలాపురం వరకు సుమారు రూ.2 కోట్లతో తారు రోడ్డు నిర్మించారు. శుక్రవారం మంత్రి పయ్యావుల కేశవ్ తారురోడ్డును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత రోడ్లు, రహదారుల రోడ్ల ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. అధ్వానంగా ఉన్న రోడ్ల రూపురేఖలు మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ ప్రభాకర్ రెడ్డి, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, పీఆర్ ఏఈ రమణయ్య, ఈఓఆర్డీ రాధా కృష్ణ, సీఐ రాజు, ఏపీఓ తులసీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగ దివ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టిని సద్వినియోగం చేసుకోండి

కుందుర్పి: అప్పిలేపల్లి గ్రామంలో కలెక్షన్ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ (సీసీ) ఆధ్వర్యంలో అందిస్తున్న చెరువు మట్టిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం మేనేజర్ నటరాజ్, ఫీల్డ్ ఆఫీసర్ యోగానంద శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ శివారులోని చెరువు నుంచి జేసీబీలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి, ఒక్కో రైతుకు వంద ట్రాక్టర్ల మట్టిని ఉచితంగా పొలాలకు తోలుకునే వెసులుబాటు కల్పించినట్లు సంస్థ ఆర్గనైజర్ అతావుల్లా, కమిటీ సభ్యులు హనుమంతరాయుడు, సదాశివ, విరుపాక్షి, సూర్యమూర్తి తెలిపారు.

పింఛన్ల పంపిణీలో ఎస్సీ,ఎస్టీలకు అన్యాయం

కళ్యాణదుర్గం రూరల్: పింఛన్ల మంజూరులో కూటమి ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీలకు అన్యాయం చేసిందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సాకే హరి విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని దళిత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని అనంతపురం పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నిస్తుండగా అర్ధరాత్రి అరెస్ట్ చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దొణ తిమ్మప్ప, తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం అవస్థలు

కుందుర్పి: మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు తీసిన 140 మంది రైతులు ఆరు నెలలుగా డీఈ, ఏఈ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వ్యవసాయ కనెక్షన్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకొని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని రైతులు కెంచయ్య, గోవిందప్ప, సోమశేఖర్, ఈరన్న తదితరులు తెలిపారు. పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా పట్టించుకునే వారు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారం దుర్వినియోగం చేస్తే చర్యలు

కుందుర్పి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని సీడీపీఓ వనజా అక్కమ్మ హెచ్చరించారు. శుక్రవారం కుందుర్పి,అప్పిలేపల్లి గ్రామాల్లో పౌష్టికాహారం పంపిణీ, బాల్య వివాహాల నియంత్రణ, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై ఆయా సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సెంటర్లు తప్పకకుండా తెరిచి ఉంచాలని సూచించారు.

వైద్యమో రామచంద్రా!

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పల్లెల్లో 'సురక్ష' పేరుతో వైద్యసేవలు
- ఉచితంగా పరీక్షలు చేసి, మందుల పంపిణీ
- కూటమి ప్రభుత్వంలో కనిపించని శిబిరాలు
- గ్రామాల్లో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరుతో గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించారు.14 రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందించారు. అత్యవసరమైతే సమీపంలోని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రెఫర్ చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పడకేసింది. సామాన్యులు సూపర్‌స్పెషాలిటీ వైద్యానికి దూరమయ్యారు. 'వైద్యమో రామచంద్రా' అంటూ ప్రజలు జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో రాయదుర్గం ఏరియా ఆసుపత్రితో పాటు కణేకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ సీహెచ్‌సీలు, 30 మండల అర్బన్ మండల పీహెచ్‌సీలు ఉన్నాయి. ఏరియా ఆసుపత్రిలో రోజుకు 500 నుంచి 600 పైగా ఓపీ పరీక్షలు జరుగుతాయి. ఇందులో సీహెచ్‌సీలతో పాటు పీహెచ్‌సీల్లో 250 నుంచి 300 వరుకు ఓపీ చికిత్సలకు వస్తుంటాయి. గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి సచివాలయ పరిధిలోనూ ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలు నిర్వహించి, వైద్య నిపుణులతో రోగులకు సేవలు అందించడమే గాకుండా మందులు కూడా ఉచితంగా అందించారు. ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకునేందుకు సిఫార్సు చేసేవారు. పిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకల సంబంధిత రోగులకు కార్పొరేట్ ఆస్పత్రులు, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులు వైద్యులను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ఉచితంగా వైద్యసేవలు అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 14 రకాల వైద్య పరీక్షలు చేసి, హృద్రోగులకు శిబిరంలోనే ఈసీజీ కుడా తీసేవారు ఈవిధంగా దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారికి నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చింది.

పీహెచ్‌సీల్లో రోగుల రద్దీ..

ఇటీవల కురిసిన వర్షాలకు నీటి కలుషితమై సీజనల్ వ్యాధులు విజృంభించాయి. పారిశుధ్య నిర్వహణ కొరవడడంతో పల్లెలో దోమల బెడద ఎక్కువైంది. ఉరవకొండ పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో డెంగీతో బాలుడు మృతి చెందగా, రాయదుర్గం మండలం కాశీపురంలో నిమోనియా బారిన పడి మృత్యువాత పడ్డారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు పీహెచ్‌సీల్లో వందలాదిగా జ్వరాలు, నిమోనియా కేసులు నమోదవుతున్నాయి.

పట్టించుకోని చంద్రబాబు ప్రభుత్వం:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపులు నిలిపివేయడంతో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో పేదలకు శస్త్రచికిత్సలు ఆగిపోయాయి. ప్రజారోగ్యం గాలికొదిలేయడంతో గ్రామాల్లో ఎక్కడ చూసిన జ్వరపీడితులు, దీర్ఘకాలిక రోగుల సంఖ్య ఎక్కువైంది. పిల్లలు, పెద్దలు డెంగీ, మలేరియా బారిన పడి అవస్థలు పడుతున్నా ఒక్క వైద్యశిబిరం కూడా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


ఉరవకొండలో జగనన్న ఆరోగ్యసురక్ష క్యాంపులో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు (ఫైల్)


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అత్యాధునిక హంగులతో నిర్మించిన రాకెట్ల పీహెచ్‌సీ భవనం

ఇబ్బందులు పడుతున్నారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు వైద్యానికి పెద్ద పీట వేసింది. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. కూటమి ప్రభుత్వంలో వైద్యశిబిరాలు ఒక్క వైద్య శిబిరం ఏర్పాటు చేయలేదు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వాన్ని పట్టడం లేదు.

– ఏసీ పార్వతమ్మ, జెడ్పీటీసీ, ఉరవకొండ

సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ వ్యాధులు వస్తే వెంటనే ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైన గ్రామాల్లో వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తున్నాం. 104 ద్వారా గ్రామాల్లో క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రత్యేక వైద్యశిబిరాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు.

– డాక్టర్ వెంకటేష్‌నాయక్, వైద్యాధికారి, రాకెట్ల, పీహెచ్‌సీ, ఉరవకొండ

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గంటౌన్: వెనుకబడిన సరిహద్దు నియోజకవర్గమైన రాయదుర్గంలో నెలకొన్న సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించాలని సీపీఐ నాయకులు డిమాండ్‌చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి సీపీఐ రాయదుర్గం కార్యదర్శి నాగార్జున మాట్లాడారు. రాయదుర్గం పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి.. గార్మెంట్స్ పరిశ్రమ అభివృద్ధికి సహకరించాలని, బీటీ ప్రాజెక్టుకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తరలించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. హెచ్చెల్సీ ఆధునీకరణ పనులు చేపట్టాలని, హెచ్చెలీ వాటా నీరు 32.41 టీఎంలు వచ్చేలా కృషి చేయాలని కోరారు. కణేకల్లులో ఎడారి నివారణ చర్యలు చేపట్టాలని, డి.హీరేహాళ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలనికోరారు. వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మార్కెట్ వసతి కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ రుణాలను వెంటనే విడుదల చేయాలని, బేడ బుడగ జంగం ప్రజలకు కులధృవీకరణపత్రాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు.

ఎంపీడీఓ లేక కుంటుపడిన అభివృద్ధి

కుందుర్పి: మండలంలో నెల రోజులుగా ఎంపీడీఓ, ఏపీఓ పోస్టు ఖాళీగా ఉన్నాయి. దీంతో మండల అభివృద్ధి కుంటుపడుతోంది. గ్రామ పంచాయతీల బిల్లులు, ఉపాధి హామీ బిల్లులు పెండింగులో ఉన్నాయి. రోజు వందలాది మంది రైతులు, కూలీలు బిల్లులు కోసం కార్యాలయానికి వెళ్తున్నారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్లు తాళలేక నాలుగు నెలలుగా ముగ్గురు ఎంపీడీఓలు, ముగ్గురు ఏపీఓలు సెలవు వెళ్లారని మండల ప్రజలు, రైతులు చర్చించుకుంటున్నారు. ఎంపీడీఓ, ఏపీఓ పోస్టులు భర్తీ చేయాలని ఇటీవల కళ్యాణదుర్గం పర్యటనలో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ప్రజలు కోరారు.